11

# నగర వీధుల్లో

ఉదయం ఐదు గంటలు.

ఇంకా తెల్లవారలేదు. వర్షాకాలం కావడంవల్ల చీకటి ఇంకా తెలుపెక్కడం కూడా ప్రారంభం కాలేదు.

మనసు చంపుకుని రాత్రంతా ఎందరో విటులను భరించిన వేశ్య సొమ్మసిల్లి పడిపోయినట్లు-నగరంలో రోడ్లు రాత్రింబవళ్ళు ట్రాఫిక్‌ను భరించి ఊపిరి పీల్చుకుంటూండగా వర్షం హోరై ముంచు కొచ్చింది ఎప్పుడో మూడుగంటలప్పుడు చినుకులు చిరుబాణాల్లా ఒంటిని గిలిగింతలు పెడుతూంటే నేల పులకించిపోతోంది.

ఒకటే వర్షం... ఎడతెగని వర్షం.

దాదాపు నిర్మానుష్యంగా ఉన్న టాంక్‌బండ్ రోడ్డు పై దీపస్తంభాలు కాంతిని ఒలకబోస్తున్నాయి. ప్రక్కన హుస్సేన్‌సాగర్ నిశ్శబ్దంగా నిద్రపోతోంది.

సరిగ్గా... అప్పుడు... ఆ రోడ్డుపై....ఆ చిక్కని వర్షంలో పిడికెడు గుండెలో కోట్ల తుఫాన్లతో పద్నాలుగేండ్ల శివుడు చిరిగిన నిక్కరుతో, మాసిన చొక్కాతో, చెప్పులులేని బోసి కాళ్ళతో, తలనిండా నిప్పుల్లా మండే ఆలోచనలతో, కళ్ళలో నుండి తన్నుకొచ్చే కన్నీళ్ళ ధారలతో- విడిచిన బాణంలా పరుగెత్తుతున్నాడు.

బయట రోడ్డునిండా వర్షం.

...వర్షంలో రోడ్డు సరిగా కనిపించడంలేదు. పరుగెత్తుతూనే కళ్ళు నులుముకున్నాడు. దుఃఖం వెక్కెక్కి ఎగిసి, తన్నుకొచ్చి... సన్నని వాని శరీరం చిగురాకులా అదిరిపడి... ఎందుకో బిగ్గరగా ఏడ్వాలనిపించింది శివునికి.

కాని ఏడ్వలేదు... పరుగెత్తుతూనే ఉన్నాడు. వడి వడిగా పడ్తున్న అడుగుల కిందనుండి నీళ్ళు ప్రక్కలకు చిందుతున్నాయి చప్ చప్‌న. నెత్తి పూర్తిగా తడిచి నీళ్ళు ముఖంపైనుండి ధారలు ధారలుగా కారుతున్నాయి. శరీరం గజగజా వణుకుతోంది.

శివునికి మళ్ళీ రాత్రి సంఘటన గుర్తొచ్చింది.

అవేకళ్ళు-తండ్రివి... అవేకళ్ళు తల్లివి.

క్రూరమైన కళ్ళు... భయంకరమైన కళ్ళు. తను ఎప్పుడూ అసహ్యించుకునే కళ్ళు. తాగి... ఇప్ప సారాయి తాగి తాగి ఎర్రగా నిప్పుల్లా మండుతూ కళ్ళు....

"నువ్వు పుట్టావ్. నీ తల్లి పోయింది... దరిద్రపు నా కొడుకా"... తండ్రి మాట. చెంప చెళ్... చెళ్... చెళ్. సారాయి కంపు. బుద్ధి తెలిసినప్పటినుండి అతనదే మాట అని... అలాగే ఒళ్ళు వాతలుపడేలా కొట్టి... తను ఏడుస్తూంటే,... రెండో పెళ్ళాం ముఖంలోకి చూస్తాడు. ఆమె కాండ్రించి ఉమ్మేస్తుంది తన ముఖంపై . తర్వాత జుట్టు పట్టుకుని అటు ఇటూ ఆడించి ఈ చెంపా ఆ చెంపా వాయించి,

"ఎందుకురా నీ పాడుపుట్క., బండకట్కోని ఏ బాయిల్నన్న పడుపోరాదు. పీడపొద్ది" అని గోడకేసి కొడుతూ..,

ఆమెను తను మొదట 'చిన్నమ్మ' అని పిల్చాడు. అంతే... అనుకోకుండా చెంప చెళ్ళుమంది. "దేవతరా అది.... దాన్ని చిన్నమ్మ అని పిలుస్త్రావా ముదనష్టపు కొడ్కా. అమ్మ... అమ్మ అని పిలు" అన్నాడు తండ్రి.

ఎందుకో ఆమెనలా పిలవాలనిపించలేదు. అందుకే పిల్వలేదు. అందువల్ల ఒళ్ళంతా చిట్లిపోయిందారోజు.

అమ్మ అంటే తనను అక్కున చేర్చుకుంటుందనీ, తల నిమురుతుందనీ, బుజ్జగించి బువ్వ పెడుతుందనీ.. ఎప్పుడో తెలుగు సినిమాలో, చిన్ననాడు చూచి... కన్నీళ్ళతో తన అమ్మ చనిపోయిందని అప్పుడప్పుడే తెలుసుకుంటున్న తన ఎదుట, ఎవరో ఓ స్త్రీని నాన్న తీసుకొచ్చి, ఆమెతో ఇంట్లో తనముందే వెకిలిగా ఇద్దరూ ఏదేదో చేస్తు సీసాల కొద్దీ సారాయి తాగడం, ప్రొద్దంతా నాన్న హమాలీ పని చేసి, రాత్రి కాగానే జంటగా ఇంట్లో తాగడం... తనను సీసా చేతికిచ్చి తరమడం. వర్షంలో, చలిలో, ఏ రాత్రయినా ఏ వేళైనా పరుగు.

తప్పనిసరైన పరుగు. లేకుంటే తోలుచిట్లే రక్తం.

"పదేండ్లచ్చినై, గాడ్దెత్తయినా ఇంకెన్నాళ్ళు సాదాల్రా నిన్ను దున్నపోతా. ఏడన్న పోయి రెండ్రూపాలు బిచ్చమెత్తుకోని బతుకుపోరాదురా. మా కర్మకు దాపురించినావ్రా" అదీ ఆమె రాత్రింబవళ్ళు చేసే ఆరడి.

ఆ మాట మొట్టమొదటిసారి ఆమె అన్నపుడు శివుని వీపుపై కొరడా దెబ్బ చురుక్కుమన్నట్టయి.

ఆ రోజు రాత్రి... ఇదే వాన... ఇదే పరుగు... గుండెల్లో ఇదేమంట, ఇవే కన్నీళ్ళు.

బ్రతకాలి... స్వయంగా, స్వంతకాళ్ళపై బ్రతకాలి. వద్దు... తనకు ఎవరి దయాదాక్షిణ్యాలు వద్దు... ఇదే టాంక్‌బండ్ బెంచీపై మూడు గంటలు ఒంటరిగా వానలో కూర్చొని... రాత్రంతా కన్నీళ్ళలో తడిచి తడిచి-

నిర్ణయం జరిగింది... దారి దొరికింది.

బ్రతకడానికి పదేళ్ళ పసివాడు ప్రపంచంలోకి అడుగుపెట్టిన ఆ రోజు... ఇలాగే ఆకాశం ఏడ్చి,

ఖాసిం సైకిల్ షాప్‌లో 'కుర్రాడు' నౌఖరీ.

సైకిళ్ళకు గాలికొట్టు, తుడువు... అయిలింగ్ చెయ్... ఖాసిం దాదాకు జర్దాపాన్ తీసుకురా... అప్పుడప్పుడు దాదాతో చైన్ దెబ్బలు తిను... నెలకు నలభై రూపాయలు జీతం.

ఐతే ఇక్కడ బ్రతకడం నేర్చుకోవడంలో దెబ్బలు తింటే ఎంత ఆనందమో. అక్కడ బానిసగా తలవంచుకుని నిలబడి తినే దెబ్బలు.. ఛూ..

ఖాసిం దాదా దగ్గర చేరినరోజు పక్షి పంజరంలో నుండి బయటపడ్డట్టు ఆనందం.

కాని... ప్రొద్దంతా పనిచేసి చేసి ఏ తొమ్మిదింటికో ఇంటికి పోతే, సైకిళ్ళకు గాలికొట్టి పంపాదించుకున్న ఏ రూపాయో అఠానో ఉంటే అదీ లాక్కోబడి, చేతిలో సారాయి సీసాతో తరుమబడి,

తిట్లూ తప్పవు... నరకం తప్పదు... అవమానం తప్పదు- దుఃఖమూ తప్పదు.

నెలలు గడచి... ఏండ్లు గడుస్తూ... అవమానాలు పడీ పడీ, కన్నీళ్ళు కార్చీ కార్చీ,

చాలదు నీ జీవితం మా జల్సాలకు.

చాలదు నీ చెమట మా సారాయికి... తే. ఇంకా తే.

ఎక్కడనుంచి తేను.

మా కనవసరం. దొంగతనం చేసి తే. గంగలో పడి చచ్చి తే... నీకు నువ్వు అమ్ముడుబోయి తే. తే పైసలు మా సారాయి కోసం.

ఖాసిం దాదా దగ్గర పైసల్లేవు. చైన్ దెబ్బలున్నాయి. వాటితోపాటు నిజాయితీ ఉంది.

కాని డబ్బులు కావాలి. ఆ రాక్షసి కోసం ఎలాగైనా డబ్బులు సంపాదించాలి. డబ్బుతో నోరుమూయించి... ఒక్కక్షణం కళ్ళు మూసుకుని హాయిగా,

కాని ఎలా... ఎలా-

అప్పుడు మెదడులో మెదిలాడు గుర్నాథం.

అందుకే పరుగు.. చీకట్లో.. వర్షంలో.. రాజధాని వీధుల్లో... దుఃఖంతో,

ఖాసిందాదాను నిన్న విడిచిపెట్టివస్తున్నప్పుడు ముంచుకొచ్చే దుఃఖం.

రాత్రి మళ్ళీ పిన్నితో తన్నులు తిన్నప్పుడు ఎగిసెగిసి పడిన దుఃఖం,

ఇప్పుడీ వర్షం నీళ్ళతో కలిసి పారే కన్నీళ్ళ వెనుక ఉరిమే ఆకాశమంత దుఃఖం-

శివుడు పరుగెత్తుతూనే కళ్ళను తుడుచుకుని,

అంబేద్కర్ విగ్రహం దాటాడు... కాళ్ళు మెరుపులా పరుగెత్తుతున్నాయి.

గుర్నాథం ఏమంటాడో... మొన్న మాటిచ్చిన ప్రకారంగా ఉద్యోగం చూపిస్తాడా మళ్ళీ ఏదైనా మెలిక పెడ్తాడా. ప్చ్... పెట్టకపోవచ్చు.

'ఒరే శివుడా... ఒక్క విషయం చెప్తాను. సరిగ్గా ఇనుకో. కష్టపడి పనిచేయాలి. పెద్ద పెద్దోళ్ళొస్తారు. ఇనయంగా ఉండాలి. వాళ్ళు చెప్పినట్టు నడుచుకోవాలి. ఎట్ల చెప్తే అట్ల చెయ్యాల్రా. ఇక నీకు పైసలక్కొదవ లేదు పోరా. ఒక్క యాడాదిల నా కొడుక నీ పిన్ని నీ కాళ్ళకింద సెప్పయి పోద్దిపోరా..'

గుర్నాథం మాటలపై గురి... ఇంట్లోని మనుషులపై కసి.

గుర్నాథం చెప్పింది నిజమే. వాడు రెండేళ్ళ క్రితం తనముందే ఆ పెద్ద లాడ్జింగ్‌లో బాయ్‌గా చేరాడు. అంతకుముందు వాని పెండ్లాం యాదమ్మ వాన్ని బీడీలు చేసి సాదేది. తర్వాత వాడు రెండు చేతులా సంపాదించి పాపం యాదమ్మను సుఖపెట్టలేదు. మరో ముండ చిలుకమ్మను పెండ్లి చేసుకుని దాంతో ఉడాయించాడు.

ఈ రోజు రాత్రికూడా ఇలాంటిదే జోరైన వర్షం.

పాపం యాదమ్మ గుర్నాథం పాదాలపై బడి వర్షం కన్నా జోరుగా గుండెలవిసేట్టు ఏడ్చింది. కాని గుర్నాథంను చిలుకమ్మ జయించింది- పిన్ని నాన్నను జయించినట్టు యాదమ్మ ఓడిపోయింది.

వర్షం ఇంకా ఎక్కువైంది.

సెక్రటేరియట్, ఏ.జి ఆఫీస్... రవీంద్రభారతి...

రోడ్లు వర్షం నీటితో నిండి నదుల్లా కనిపిస్తున్నాయి.

ఇంకో రెండు నిమిషాల తర్వాత శివుడు...ఆ స్టార్ హోటల్ పోర్టికో దగ్గర నిలబడి... చుట్టూ వర్షం చినుకుల చప్పుడు కొత్తగా, భయంకరంగా వినిపిస్తూండగా డబ్బున్న మనుషుల వాసన లాడ్జ్‌లోనుండి బయటికి చిమ్ముకొస్తూండగా భయం భయంగా తనవంక తనే చూచుకున్నాడు. వెంటనే వానికి తను నీళ్ళలో ముంచి తీసిన కోడిలా ఉన్నట్టు అర్థమైంది. గబగబా చొక్కాను విప్పి, పిండి నెత్తినీ, ఒంటినీ తుడుచుకుని మళ్ళీ పిండి తిరిగి తొడుక్కున్నాడు. తర్వాత మెల్లగా తొంగి రిసెప్షన్ కౌంటర్ వంక చూచి,

తను కాలుపెడ్తే ఆ హోటల్ యొక్క పాలరాతి నేల మాసిపోతుందేమోనని తల్లడిల్లుతూ మెల్లగా నడచి-

రిసెప్షన్ కౌంటర్‌లో ఉన్న అందమైన పిల్లికళ్ళ స్త్రీ కునికిపాట్లు పడ్తూ పడ్తూ ఎందుకో ఎదుట ఏదో లీలా మాత్రంగా కదలినట్లనిపించి కళ్ళు విప్పి శివున్ని బురదలో బొర్లి బొర్లి అప్పుడే లేచి వచ్చిన పంది తనముందు నిలబడి ఉన్నట్టు- అసహ్యంగా చూచి, పరమ వికారంగా ముఖంపెట్టి- "ఎవడ్రా నువ్వు" అంది.

"గు...గు..గుర్నా...థం"

"ఆ...గుర్నాథం..?"

"గుర్నాథం మా పెద్దమ్మ కొడుకు.. నన్ను రమ్మంటే"- గజగజ వణికిపోతున్నాడు. చలితో, భయంతో.

"అక్కడ బయట నిలబడు..." అని కసిరి- నాల్గవ ఫ్లోర్‌కు బజర్ నొక్కింది.

శివుడు అతి వినయంగా వెనక్కి నడిచి ఓ ప్రక్క నక్కి నిలబడ్డాడు.

ఓ ఏడెనిమిది నిముషాల తర్వాత గుర్నాథం కంఠం వినబడితే.. తల త్రిప్పి ముఖం చూపించి, ఓ వెకిలి నవ్వు నవ్వి-

"మేడమ్... మన హోటల్ వర్కర్స్ సమ్మె చేస్తున్నారు కాబట్టి బాస్ మొన్న ఎవరన్నా కుర్రాళ్ళుంటే తీసుకురమ్మన్నాడు. వీడు మనోడే. మంచి కుర్రాడు. నాల్గురోజులు రూమ్‌నెంబర్ నాల్గువందల ఇరవై నుండి ముప్పయ్‌దాకా ఇచ్చి చూద్దాం. బాగుంటే వాడుకోవచ్చు..."

"ఊ.. సరె సరె... ఇప్పుడు షిఫ్ట్ ఎక్కుతాడా వీడు"

"ఔను మేడం"

శివుడు గుర్నాథం యూనిఫారంనూ, చుట్టూ పాలరాతిగోడలనూ, తెల్లని పాలవెలుగునూ గుడ్లప్పగించి చూస్తూ-

"నడ్రా వాతో" అన్న గుర్నాథం మాటతో ఉలిక్కి పడి వెంట నడిచి,

లిఫ్ట్ ఎక్కి...

స్వర్గానికి పోతున్న అనుభూతి ఆ పసిగుండెలో. ఉక్కిరిబిక్కిరై కేరింతలు కొట్టాలన్న ఉద్వేగం.

"ఒరే... నేను పైకిపోగానే నీకు యూనిఫామిస్తాను. ఈ బట్టలు విడిచి అవి తొడుక్కో. పది రూంలిస్తాను. వాటిని చూచుకోవాల. వాటిలో ఉండే కస్టమర్స్‌కు ఎవరికేమి కావలసినా క్షణాలమీద తెచ్చివ్వాలి. కింద బారుంది. ఎదురుగా మిలటరీ హోటలుంది. కౌంటర్ దగ్గర అమ్మాయిల బ్రోకర్ రాముడున్నాడు- రేపు సాయంకాలందాకా నీ డ్యూటీ... చూస్తా మరి నువ్వేం జేస్తావో.."

"అమ్మాయిల బ్రోక్..." గొంతు పెగలక... తత్తరపడ్తూ..

"అబ్బా.. అది నీకర్థమయ్యే విషయం కాదిప్పుడు. నే చెప్తాలే తర్వాత..."

లిఫ్ట్ ఆగి...

ఇద్దరూ స్టోర్‌రూంలో ఉన్న పాడుబడ్డ ఓ మూల వైపు పోయి.

ఆ బట్టలిడువు ఇవేసుకో.

శివుడు మొట్టమొదటిసారిగా ఇస్త్రీ బట్టలు వేసుకున్నాడు. తెల్లని బట్టలపై బంగారు రంగు పట్టీలు.

భుజంపై ఎర్రరంగు బిళ్ళలు. ఇత్తడి గుండీలు, నెత్తిపై ఖడక్ టోపీ. పరమవీర చక్ర పతకాన్ని అప్పుడే హృదయంపై అలంకరించుకున్న సైనిక వీరుడు పొంగిపోతూ తన మెడల్స్‌వంక తనే గర్వంగా చూచుకున్నట్టు, శివుడు తన వంక తనే ఓసారి అద్దంలో చూచుకుని... నవ్వుకుని.,

బయటికి వచ్చి,

గుర్నాథం వెంట నడుస్తూ తన డ్యూటీ గదులను పరిచయం చేసుకుని... ఒకసారి బయటికి రోడ్డుదిక్కు చూస్తే...ఇంకా అలాగే కురుస్తున్న చిక్కని వర్షం. చినుకుల వెనుకనుండి తూర్పున ఎర్రగా సూర్యోదమౌతోంది.

శివుడు.. పధ్నాలుగేళ్ళ శివుడు రవ్వంత ఊరటతో కొండంత ఆనందపడ్తూ నిట్టూర్చాడు.

సరిగ్గా అప్పుడే- నాలుగువందల ఇరవై గది బజర్ గర్ర్ర్‌మని మ్రోగింది. పరుగెత్తాడు శివుడు. గుర్నాథం చెప్పిన విషయాలన్నీ మెదడులో కదులుతున్నాయి. చిన్నగా తలుపు చప్పుడు చేశాడు.

"కమిన్" అన్న ఓ స్త్రీ కంఠం.

అడుగు లోపలికి వేసి...షాక్ తిన్నట్టుగా అదిరిపడి, అప్రతిభుడై,

ఆమె చెదరిపోయిన విశాలమైన ఫోమ్ బెడ్‌పై ఒంటిపై ఒట్టి నామమాత్రపు బట్టలతో ఎంతో నిర్లక్ష్యంగా పడి ఉండి... మంచం నిండా వాడిపోయిన గులాబీరేకులు, మల్లెపూలు. ప్రక్కన టీపాయ్‌పై రెండుమూడు విస్కీ సీసాలు నేలపై అక్కడక్కడ విలువైన పుస్తకాలు... డ్రెస్సింగ్ టేబుల్ ముందు ఏవేవో కాస్మాటిక్స్- ప్రక్కన బాత్‌రూంలోనుండి జోరుగా వినవస్తున్న షవర్ చప్పుడు.

"యస్...మేడం"

ఆమె తల తిప్పి శివుని వంక చూచి... అదే మత్తుతో "డ్యూటీ మారావా" అంది.

"ఔను మేడం"

ఆ తలుపు పెట్టి ఇక్కడికిలా వచ్చి ఈ మంచంపై కూర్చో.

షాక్... ఏదో తెలియని అలజడి. నరాల్లో తుఫాను. రక్తం అంటుకుని మండుతోంది... కాని తప్పదు.

అలాగే చేసి... కూర్చుని...

"ఒరేయ్...నీ పేరు..." గోముగా కంఠం. దాంట్లో స్పష్టంగా విస్కీ నిషా.

"శివుడు"

"చక్కని పేరు...శివుడూ...ఒక్కసారి కాళ్ళు పిసకరా... ఒళ్ళంతా హూనమైపోయింది"

కాళ్ళు పిసకడమా.. తను ఈ ఒళ్ళమ్ముకునే మనిషిలా కనిపిస్తున్న ఈమె కాళ్ళు పిసకడమా- తుఫాను, తుఫాను... గుండెల్లో అరుస్తున్న తుఫాను... కాని... కాని,

చేతులు కాళ్ళపై పెట్టి.. జల్లుమంది ఒళ్ళు.. మళ్ళీ తుఫాను.

వ్రేళ్ళు అదుముతూ-పిసుకుతున్నాడు.

చెమట పడ్తోంది నుదుట. ఆమె సన్నగా మూల్గుతోంది... అటు, ఇటు అని చెప్తోంది... నిర్లక్ష్యంగా వెల్లకిలా పడుకుని, కళ్ళుమూసుకుని-

అందమైందే..ఆమె విడిచేసిన చీర ప్రక్కన మంచంపైనుండి నేలపైకి జారుతోంది.

"ఒరే శివుడూ... ఆ సీసాలోని విస్కీని గ్లాసులో ఓ పెగ్గువంచివ్వరా...'

ఇంత ఉదయమేనా.

లేచి గ్లాసులో డ్రింక్ పోసి అందించాడు.

ఆమె గటగటా ఒట్టి రా విస్కీని తాగి- గ్లాసును తిరిగి అందిస్తూ "థ్యాంక్యూ" అని బ్రతకడం కోసం విషాన్ని తాగినట్టు అందమైన కన్నులతో దీనమైన చూపు చూచి-

షవర్ చప్పుడు వినిపిస్తూనే ఉంది ఆగకుండా,

ఈలోగా తలుపులపై మెల్లగా టక్ టక్-

"తెరువురా. వాడే ఐ ఉంటాడు నా మగడు. పెళ్ళాన్ని మంది పక్కలో పండబెట్టి బతికే బాడ్కౌ మగడు..."

శివుని తలపై బాంబు పడ్డట్టు... ఓ విస్ఫోటనం...

మౌనంగా వెళ్ళి తలుపు తెరిస్తే... ఎదురుగా ఫుల్ సూట్లో అందమైన మగవాడు. శివునివైపు వింతగా చూచి, లోపలికొచ్చి కుర్చీని లాక్కుని కూర్చుని సిగరెట్టు వెలిగించుకుంటూ,

"ఆ కాగితాలపై సంతకాలు చేయించావా" అన్నాడు గాలితో, ఆమెవంక చూడకుండా.

"ఊ..." అంది ముఖాన్ని అతనివైపు తిప్పకుండానే.

అతను చటుక్కున పొంగిన ఉత్సాహంతో ఆమె హాండ్‌బ్యాగ్‌ను అందుకుని తెరిచి... అక్షరాల్లో మునిగిపోయాడు.... అతని ముఖం వేయివాట్స్ బల్బులా ఉంది.

ఈలోగా బాత్‌రూంలోనుండి షవర్ చప్పుడు ఆగి... అతను ఉలిక్కిపడి తిరిగి ఆ కాగితాలను బ్యాగ్‌లో సర్ది ఆమె కందిస్తూ- "నువ్వు ఫ్రెష్‌కా. నేను మళ్ళొస్తాను" అని చరచరా బయటికివెళ్ళి,

"శివుడూ ఆ బ్యాగ్ ఇటివ్వరా..." అని... అందిస్తె తీసుకుని వెదికి ఓ గుప్పెడు రూపాయల ఉండనుతీసి... ఐదు రూపాయల నోటును ఇచ్చి... 'వెళ్ళు' అందామె. అదే సమయానికి బాత్‌రూంలో నుండి వచ్చాడతను. నల్లనివాడు, పరమవికారపు ముఖముగల వాడు, ఎలుగుబంటులా ఉన్నవాడు.

శివుడు తలుపు తీసుకుని పోబోతూండగా "ఏయ్ బాయ్... రెండు కాఫీ పట్రా" అన్నాడు బొంగురు గొంతుతో.

"అలాగే సర్"- చివుక్కుమంది మనసెందుకో.

బయటికి రాగానే ప్రక్కగదినుండి ఎప్పటినుండో బెల్ మ్రోగుతూండడం వినిపించి- పరుగెత్తి...

"ఎంత సేపట్నుంచి పిల్వాలె బే. ఏడ సచ్చినౌ బాడకౌ"

బే.. తనను బే.. ఊర్కెనే... చెంపమీద చరిచినట్టనిపించి...

"మాట్లాడవేందిబే సాలే..."

చటుక్కున ఉక్రోషంగా తలెత్తి,

"ఏం జూస్తానౌ... ఊడ్వు రూమంతా"

కళ్ళనిండా నీళ్ళుతిరిగాయి. చీపురందుకున్నాడు.

గదిని ఊడుస్తుంటే నేలపై కళ్ళలో నుండి టపటపా కన్నీటి చుక్కలు పడి - ప్రక్కన ఏదో గదిలోనుండి బెల్ పిలుపు వినవస్తూ... అక్కడెన్ని తిట్లో,

"వెళ్ళి నాల్గు ప్యాకెట్లు గోల్డ్‌ప్లాక్ కింగ్‌సైజ్- వెంకటేశ్వర నుండి చికెన్ లివర్ ఫ్రై తందూర్ రోటీ, ఆమ్లెట్ తీసుకురా... వింటానవా"

"వింటున్న సార్"

"ఆ జేబులో వందరూపాయల నోటు తీసుకో-" వెళ్ళి తీసుకుని - బాత్‌రూంలో నీళ్ళు చూచి - హాట్‌వాటర్ వస్తుందో లేదో చెక్ చేసి వెళ్ళు"

"అలాగే సర్"

బాత్‌రూంలోకి వెళ్ళి... కుళాయిలు తిప్పుతూ.... చుయ్ చుయ్‌మని నీళ్ళ చప్పుడు-

"అబ్బా నాకదే సీన్ జ్ఞాపకమొస్తోందిరా... కత్తిని వాని గుండెల్లోకి దించినపుడు వాడు అరచిన అరుపు, వాడు చూచిన చూపు... ఎర్రగా బుసబుసా పొంగిన రక్తం... ఇప్పుడే మనం హత్య చేసినట్టు..." నలుగురిలో అప్పటినుండి మాట్లాడకుండా ఉన్నవాని గొంతు.

"ష్ ష్...గోడలకు చెవులుంటాయి గాడిదా. మన ఎమ్మెల్యేగారు అదంతా చూచుకుని ఫోన్ చేస్తారుగదా. అప్పుడు నిశ్చింతగా వెళ్ళొచ్చు. అందాకా ఆ సీన్లు జ్ఞాపకం రాకుండా వేసెయ్ మందు తెప్పించమంటావా ఓ ఫుల్ బాటిల్. యాభైవేల కాంట్రాక్ట్... ఒక్క చాకుతో.. భలేమంచి చవక బేరము-"

శివుడు కొయ్యబారిపోయాడు. మనుషుల్ని చంపే వాళ్ళకు తను పనిమనిషిలా సేవ చేయాలి...

బాత్‌రూంలోనుండి బయటికి రాగానే వాళ్ళ ముఖం చూడాలంటేనే భయం, అసహ్యం కలిగి-

"అలాగే ఇంకో మెక్‌డవెల్ విస్కీ ఓ ఫుల్ బాటిల్ తీస్కరారా"- ఇదిగో మరో వంద-"

యాభై వేలు... వందలు.. ఒకటి... రెండు... మూడు-ప్చ్... బుసబుసా రక్తం.

పరుగు.. పరుగు- ప్రక్క గదిలోకి పరుగు.

అప్పుడే వచ్చిన ఖద్దరు బట్టల మనిషి కూర్చుంటూండగా రూంలో ఉన్న ఇద్దరు అతివినయంగా చేతులు కట్టుకుని నిలబడి-

"ఒరేయ్ గాడిదా ఎన్నిసార్లు పిల్వాలిరా.. సారొచ్చిండు... ఏంగావాల్నో అడిగి...సార్ కాఫీ, టీ... టిఫిన్..." బానిస... బానిస ధ్వని అపాదమస్తకం.

"ఏం తెమ్మంటారు సార్.."

"నాకు ఉదయమే కాఫీ తాగే అలవాటు లేదు. పరగడుపు నీట్‌గా ఓ స్కాచ్ పెగ్ కొట్టేస్తానంతే-" అంది ఖద్దరు కంఠం.

"అలాగా సార్. అలా చేయడం ఆరోగ్యానికి ఎంతో మంచిది. ఒరే బాయ్.. వెంటనే ఉరికి ఓ స్కాచ్ పట్రా.. ఇదిగో డబ్బు-"

నోట్లు...వందలు...ఒకటి..రెండు..మూడు.

"అలాగే...మూడు బ్రైన్ ఫ్రై పట్రా.. తొందరగా రావాలి సార్ వెళ్తారు-"

బయటికొచ్చాడు శివుడు.

ఎర్రగ ఎండ రోడ్లపై పరుచుకుని.. సన్నగా కురుస్తున్న తుంపర బంగారు పొడిలా రాలుతోంది.

జేబులో నోట్లు కుక్కుకుని- మెదడులో ఎన్ని ఆమ్లెట్లో, ఎన్ని చికెన్ లివర్లో, ఎన్ని బ్రైన్లో... లిఫ్ట్ అరుస్తూండగా.. రోడ్డుపై శివుని పాదాలు పరుగులాంటి నడకతో సాగుతున్నాయి.

బే-సాలే...రారా.

ఆడదాని...కాళ్ళు...ఎలుగుబంటు... ఖద్దరుమనిషి...హత్య-ఏభైవేలు...నీటికంటే హీనంగా ప్రవహిస్తున్న డబ్బు-

పరుగు...పరుగు. గుర్నాథం చెప్పిన అడ్రస్‌ల మనన.

ఏదో మింగకూడని దాన్ని మింగుతున్నట్టుగా వికారం.

పావుగంట గడిచి - హోటల్‌లో ఆర్డర్లు చెప్పి- బార్‌లో లిక్కర్స్ తీసుకుని...తిరిగొచ్చి పాకెట్లన్నీ సర్దుకుని... తన యూనిఫాంతో ఛాతిపై ఉన్న తమ హోటల్ పేరున్న బిళ్ళ ఎంతో విలువనిస్తూండడం శివునికి తెలుస్తోంది.

రెండు చేతుల్లో రెండు సంచులతో పరుగు...తొందర..ఆలస్యమైపోయిందని ఎవరెవరేమని తిడతారోనని ఉరుకు-పరుగు-భయం.

శరీరం అలసటతో చెమటలు కక్కుతుండగా మెట్లన్ని ఎక్కి ఖద్దరు రూంలోకి పోబోతుండగా,

"మంత్రిగారు నలభైరెండు వేలిమ్మన్నారు. సాయంకాలం వరకు మీ ఫైల్ సంతకమై లైసెన్స్ రెడీగాఉంటుంది. నేను ఇక్కడకు పట్టుకొచ్చి మీ కాగితాన్నిస్తాను... ఒ.కే."

"అలాగే సార్... ఇదిగోండి క్యాష్. సాయంత్రం ఆరునుండి మీకోసం ఎదురు చూస్తుంటాం"

"అలాగే..."

నోట్లు రెపరెపలాడుతున్న ధ్వని...డబ్బు వాసన.

"అక్కడపెట్టిపో-"

అన్నీ సర్ది-" ఐదురూపాయలు మిగిలినయ్‌సార్"

"ఉంచుకో పోబే- వెళ్ళు. డిస్టర్బ్ చేయకు"

బయటికొచ్చి...బే... ఐదు రూపాయలు-

హంతకుల గది...మెక్ డవెల్స్-చికెన్ లివర్ ఫ్రై..ఆమ్లెట్స్.

"ముద్దుగున్నవ్‌రా పోరగా, ఏం పేరు."

"శివుడు"

"అబ్బో.. మంచిపేర్రో..."

"ఎనిమిది రూపాయలు.." చిల్లర చేతికిస్తే- మూడు రూపాయలు తిరిగిచ్చి.

"ఉంచుకో పో"-

ఎలుగుబంటి గదిలోకి ఫ్లాస్క్ తీసుకెళ్ళి కాఫీని గ్లాసుల్లో వంచి ఒకటి వానికిచ్చి... మరొకటి ఆమెకందిస్తూ...అప్పుడే స్నానం ముగించి ముస్తాబైన ఆమె ముఖంలోకి చూచి... 'దేవతలా కనిపిస్తోందామె' అనిపించి,

మౌనంగా బయటికి నడిచివచ్చి,

రోడ్డుపైకి చూస్తూ...రద్దీ పెరుగుతోంది...బస్సులు, కార్లు...జనం పరుగు...సన్నగా ఆగిపోని తుంపర.

రెండు గంటల్లో పది రూపాయలు ఆదాయం.

జేబులో నోట్లు..

ఖాసిం దాదా దగ్గర ఎనిమిది రోజుల జీతం...

కాని... ఈ పని.. ఈ తిట్లు ఈ... ఇంకా ఇంకా ఏదో అనుకుంటుండగానే, ఫలానా అని చెప్పలేని దేన్నో పోగొట్టుకుంటున్న బాధ.

కడుపులో తెలిసివస్తున్న ఆకలి... కళ్ళనుండి శూన్యం,

గుర్ర్ర్ర్-బెల్... ఇండికేటర్‌పై 426ల పరుగు.

కొట్టుకుంటారేమో ఇక అన్నట్టు తిట్టుకుంటున్నారు ముగ్గురు-

'నన్ను సినిమాల్లో చేర్పిస్తానని తీసుకొచ్చి పదిహేను రోజుల్లో పదివేల రూపాయలు ఖర్చు చేయించారు. ఏదన్నా గట్టిగా అంటే ఏదో ఓ ముండను తెచ్చి నాదగ్గర పడుకో బెడ్తున్నారు. ఏయ్ మిస్టర్... కమాన్ చెప్పండి..."

"తొందర పడ్తే ఎలాగయ్యా మగడా.. సాధనమున పనులు సమకూరు ధరలోన విశ్వదాభిరామ వినురవేమ. తెప్పించు అన్నారు... ముందు నువ్వు ఓ బ్రహ్మాండమైన టిఫిన్ తెప్పించు. అప్పుడు బుర్ర పనిచేస్తుంది. విచారణ చేద్దాం... ఒరేయ్ కుర్రకుంకా తెల్లాడి టిఫిన్, తెల్ల ఆమ్లెట్ పరాటా పట్రా... తీన్‌సెట్స్.. బావగారూ ఆ క్రోధ ధృక్కులను మాని ధనంబునొసంగుడు.."- ఎవడో శిఖండి..

రెండు యాభై నోట్లు బయటపడి- తర్వాత శివుడు బయటపడి..

మేడం మొగుడి గదిలో నుండి బెల్-

"ఆ ఎలుగుబంటుగాడున్నాడ్రా"

"ఉన్నాడండీ.."

"అమ్మనాకొడ్కా...అదేమన్నా పెట్రోల్ బంకారా లంజాకొడ్కా రాత్రింబవళ్ళు వాడుకుంటున్నావ్...ఓ క్వార్టర్ ఒ.టి. పట్రారా..."

429- నుండి నిర్వరామమైన పిలుపు. కొత్తగది.

ఎనిమిది మంది ఆడవాళ్ళు .అందరూ దాదాపు అలసిపోయినట్టు... నలిగిపోయినట్టు-

"మొత్తం పద్నాలుగువందలు వసూలు. మీ కమీషన్ ఐదువందలు. స్నానాలైనాయి గదా బయట టాక్సీలు రెడీగా ఉన్నాయి. టిఫిన్ కానిచ్చి రూం ఖాళీ చేద్దామా" లీడర్‌లా ఉన్న వయసుమళ్ళిన స్త్రీ అంటోంది.

"ఎనిమిది దోసెలు-ఎనిమిది ఇడ్లీలు... ఎనిమిది స్ట్రాంగ్ కాఫీలు.. ఇదిగోరా డబ్బు"

రా..రా..తనను 'రా' అని పిలుస్తున్నారు.

ఎక్కడిదీ డబ్బు... ఊహిస్తే అసహ్యం-

డబ్బును చేతిలోకి తీసుకుని శిలువను మోస్తున్న క్రీస్తులా

తలనిండా హోరు... నిప్పుమండుతున్నట్టు బాధ.

పరుగు-మెట్లపైనుండి..

వర్షం మళ్ళీ ఎక్కువైంది. జనం పరుగులు తీసి తీసి.. రోడ్లు ఖాళీ ఐ-

వర్షంలో ఉరుకుతున్నాడు శివుడు బార్‌కు, హోటల్‌కు.

ఆడవాళ్ళు..హంతకులు..వేశ్యలు..పైరవీకార్లు..తరుముతున్నారు అదేపనిగా... చేతులనిండా పొట్లాలు, సీసాలు, పార్శిళ్ళు... క్యారేజీలు..,

తను తడిచినా ఫర్వాలేదు. కాని ఇవేవీ తడువగూడదు. పిట్టరెక్కలకింద పిల్లలను దాచుకున్నట్టు.. వీటిని కడుపులో దాచుకుని,

ఆకలి... ఆకలి... ఆకలవుతోంది కడుపులో. ప్రేగులు అరుస్తున్నాయి.

ఉదయం గడిచింది. టిఫిన్లు గడచి-లంచ్ కొచ్చింది. క్యారేజీల మోత. మళ్ళీ సీసాల, విస్కీల, బీర్లమోత, చీత్కారాలు, తాగిన నోళ్ళు మాట్లాడే కంపు బూతులు.. తిట్లు.. తరుముడు,

వర్షం తగ్గడం లేదు.

పిలుపులు తగ్గడం లేదు.

పరుగులు తగ్గడం లేదు.

ఒంటినిండా నీటి ధారలు కారడం ఆగడం లేదు

మధ్యాహ్నం దాటి... గదుల్లో పేకాటలు, బయటకి పోవడాలు మొదలై-430 లోకి కొత్త పార్టీ దిగింది సూట్‌కేస్‌లు మోసుకొచ్చి-

రాగానే ఆర్డర్-ఫుల్ బాటిల్ పీటర్‌స్కాట్, చికెన్ మంచూరియా.

మళ్ళీ పరుగు.

ఎందరికో తింటానికి వాళ్ళవాళ్ళ కిష్టమైనవనీ తెస్తూ, తనకు ఖాళీ కడుపు మిగుల్తూ,

రోడ్డుపై...వర్షంలో పరుగు-

పీటర్ స్కాచ్ తెరుస్తూండగా వినిపించింది "పది వేలు నువ్విస్తే ఇరవై ఐదు వేలు మేమిస్తాం. గుర్తుబట్టడం నీతరం, నాతరం ఆ దేవునితరంకూడా కాదు"

అర్థమైపోయింది శివునికి.

"విస్కీని గ్లాసుల్లో వంచురా"

రా..రా..రా..

బే..బే-సాలే... బాస్టర్డ్... హృదయం తూట్లుపడిపోతోంది. తాగుడు ఎక్కువైనకొద్దీ తిట్లు ఎక్కువ. బూతులు ఎక్కువ. రాక్షసుల్లా ప్రవర్తించడం ఎక్కువ-

దొంగలు..కొంపలు కూల్చేవాళ్ళు..భార్యలనమ్ముకునేవాళ్ళు.. దగాకోర్లు.. హంతకులు..వీళ్ళకు సేవలు చేస్తూ... వీళ్ళతో తిట్లు తింటూ... వీళ్ళ కాళ్ళు పిసుకుతూ,

వీళ్ళిచ్చే 'టిప్'లు తీసుకుంటూ

తను ఎవరు..?..ఎవరు తను..?

ఏం చేస్తున్నాడిక్కడ తను...డబ్బు సంపాదిస్తున్నాడా.

ఏంజేస్తాడీ డబ్బు..ఎందుకీ డబ్బు.

ఈ పాలరాతి బంగళాలో ఎంత వికారమైన జీవితం ఉంది.

శివుని చేయి జేబులోకి పోయింది అనుకోకుండా. బయటికి తీస్తే గుప్పిడి నిండా నోట్లు. పచ్చగా, ఎర్రగా..ఐదులు.. రెండ్లు.. బిళ్ళలు... ముప్పయ్ రూపాయలైతాయేమో,

శివుని తలలో ఆలోచనల అడవి అంటుకుని మండుతోంది.

లాంజ్‌లో నిలబడి పడమటి దిక్కు చూస్తున్నాడు.

వర్షం ఇంకా ఎడతెగకుండా కురుస్తూనే ఉంది.

ఎర్రగా సూర్యుడు అస్తమిస్తూ... ఆకాశం తగల బడినట్టు మంటలనీడలు.

420, 423, 426, 429...

బజర్స్ మ్రోగుతున్నాయి. ఇండికేటర్‌లో నంబర్లు మెరుస్తున్నాయి.

శివుడు పరుగెత్తలేదు. పిడికిలినిండా నోట్లతో ఆలోచిస్తున్నాడు.

క్షణం తర్వాత - సిద్ధి పొందిన తర్వాత గౌతమునిలా వెనుదిరిగి అడుగులో అడుగేసుకుంటూ నడచి వెళ్ళి... యూనిఫాం తీసి- తన మాసిన చొక్కాను, చిరిగిన నెక్కర్‌ను వేసుకుంటూ...

రా...

బే...

సాలే...

బాస్టర్డ్... కాలుతున్న కాగితంలా మనసు-

★ ★ ★

గుండుసూదుల్లా రాలుతున్న చినుకుల్లో పరుగెత్తుతున్నాడు శివుడు... టాంక్‌బండ్ రోడ్డుపై... వెనుక నుండి ఎవరో తరుముతున్నట్టు.

అప్పుడే చీకట్లో మునిగిపోయిన నగరం వర్షంలో లైట్లకాంతితో సింగారించుకుంటోంది.

రోడ్డుపై పడి చిట్లి పొగలా వ్యాపిస్తున్న చినుకుల్లో శివుని కాళ్ళు మెరుపు తీగల్లా ఉరుకుతున్నాయి.

ఆకాశం ఫెళఫెళా ఉరుముతోంది... బయట.

లోపలా ఉరుములే...

కళ్ళనిండా నీళ్ళు... తలలోని నిప్పుల్లో నుండి వస్తున్న నీళ్ళు. పరుగెత్తి... పరుగెత్తి... పరుగెత్తి,

ఖాసిం దాదా సైకిల్ ట్యూబ్‌ను అతికి గాలికొడదామని తన ముసలి శరీరంతో లేవడానికి ప్రయత్నిస్తూండగా, రివ్వున వచ్చిన రెండు కాళ్ళు చటుక్కున ఎదుట ఆగి, క్రింద ముద్దగా పిసికిన చిల్లరనోట్ల ఉండపడి విచ్చుకుని

పంపునందుకున్నాడు శివుడు.

తలెత్తి చూచిన ముసలాయన ముఖం నిండా చిర్నవ్వును పులుముకుని

"అరె...తు కహా గయారే బేటా కల్‌సే. నువ్వు లేకుంటే నాకు ఏ పనీ చేయరావడం లేదు.." అంటున్నాడు ఖాసిందాదా.

శివుడు మాట్లాడలేదు. వెక్కెక్కిపడి ఏడుస్తున్నాడు.

ఏమి అర్థంగాని ఖాసిం వాన్ని గుండెలకదుముకుని-

శివుని ముఖంపైనుండి వర్షం నీళ్ళు, కన్నీళ్ళను కలుపుకుని ధారలు ధారలుగా కారుతున్నాయి.

శివుని గుండెలోని అగ్ని ఆరిపోవడం ప్రారంభమైంది. అప్పుడే ఖాసిందాదా వెలిగించిన గుడ్డిదీపం వెలుగులో అతని ముఖం మంటలా మెరుస్తోంది.

'ఉదయం' వారపత్రిక, 18.03.1984
దీపావళి కథల పోటీలో బహుమతి పొందినది.